సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 113 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం | 24.08.2025



## యూరియా ఇబ్బందులు రావొద్దు

- జిల్లా కలెక్టర్లకు మంత్రి పొన్నం సూచన

4 లో




# మన పిల్లల రక్షణ చేతుల్లోనే..

## పోక్సో చట్టంపై అవగాహన అవసరం

**చిన్నారులను** చిదిమేసే నీచులు ఎక్కడో ఉండరు. వారు మన చుట్టూ మనతో మంచిగా నటిస్తూ మన శ్రేయోభిలాషులు, బంధువులు, ఇరుగు పొరుగు వారు, అపరిచిత వ్యక్తులు, సన్నిహితులే కావచ్చు . తల్లిదండ్రులు పని కోసం బయటకు వెళ్లినప్పుడు ఇంటి పక్కన ఉన్న పెద్దాయన వారి పాపపై కన్నేశాడు. చాక్లెట్ ఆశచూపి చిన్నారిపై పక్కింటి అబ్బాయి అత్యాచారం చేశాడు. అడుకొంటున్న పాపపై ఒక అపరిచిత వ్యక్తి అత్యాచారం చేశాడు. బడిలో చదువుతున్న పాపపై ఉపాధ్యాయుడి కన్ను, పక్కింట్లో టీవీ చూడడానికి వెళ్తున్న చిన్నారిపై ఓ కుర్రాడు అకృత్యం.. ఇలాంటి అకృత్యాలను అడ్డుకోవడం కోసం ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకొచ్చింది.



3 లో

## కుదిరితే ఇసుక.. లేదంటే మట్టి..

- ఇదీ అక్రమార్కుల పనితనం
- మామూళ్ల మత్తులో అధికారులు

4 లో



## ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, సంబంధిత శాఖ అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ, హిందూ ధర్మ పరిషత్, ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు.

- మన చౌరాస్తా, హనుమకొండ

2 లో





## మౌలిక వసతులు కల్పిస్తాం : అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని ఖిలాషపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. తాగునీటి కొరకు బోరు మరమ్మత్తులు చేపట్టాలని, అవసరమైతే కొత్త బోరు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాల ఆవరణను చదును చేయించాలని క్రీడలకు వినియోగించాలన్నారు విద్యార్థులకు వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల గదులను సందర్శించి పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ లను వినూత్నంగా ఆకర్షణీయంగా ఉండే విధంగా చేపట్టాలన్నారు. అదే గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలోని ప్రీ ప్రైమరీ గదులను సందర్శించి అదనంగా రెండు గదులు ఏర్పాటుకు చర్య తీసుకోవాలని, మరుగుదొడ్లు నిర్మాణం, చేతులు కడుక్కునేందుకు వాషింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలోని గోడలపై అందమైన బొమ్మలు పెయింటింగ్ వేయించాలని పిల్లలకు ఆకర్షణీయంగా కనిపించే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం అదే గ్రామంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారులు ఏఎమ్‌వో శ్రీనివాస్, ఏడీ మూర్తి, సీఎం ఓ నాగరాజు, రఘునాథపల్లి ఎంఈఓ రఘునందన్ రెడ్డి, ఖిలాషపూర్ హెచ్‌ఎం రవీందర్ తదితరులు ఉన్నారు.





# ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలి

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ: ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, సంబంధిత శాఖ అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ, హిందూ ధర్మ పరిషత్, ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు పోటీ తత్వంతో కాకుండా భక్తి భావంతో నిర్వహించాలని తెలిపారు. గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా గణేష్ మండళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. వాతావరణం కలుషితం కాకుండా ఉండేందుకు మట్టి వినాయకులు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలని, నవరాత్రి ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునేలా ఏర్పాట్లను చేసుకోవాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు. గత ఉత్సవాలు అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసువారితో సహకరించాలని కోరారు. గతంలో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాలకు ఎటువంటి అంతరాయం కలిగించకూడదని అదేవిధంగా ఏర్పాటు చేయడం మండపాలు భూతగాదాలు, వివాదమయ్యే ప్రదేశాలలో అనుమతులు ఇవ్వకూడదని పోలీసులకు సూచించారు. డీజే సౌండ్ సిస్టం అనుమతించకూడదని, మండళ్లు ఏర్పాటు చేసిన చోట్ల, సౌండ్ సిస్టం, నిమజ్జన సమయంలో భక్తి భావనతో కూడిన పాటలను మాత్రమే వేసే విధంగా చూడాలని కోరారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఒకే రోజు రావడం వలన మతసామరస్య దెబ్బతినకుండా ఉండే విధంగా ముస్లింలు సహకరించాలని కోరారు. ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా ఉత్సవాల నిర్వహించుకోవాలని కోరారు. నిమజ్జనోత్సవం అప్పుడు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, బారీకేడ్ల ను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల వద్ద చేపట్టాల్సిన చర్యలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, రిజ్వాన్ భాషా షేక్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల ఆదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ముస్లిం పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## పోక్సో చట్టంపై అవగాహన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం చౌడారం కేజీబీవీలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ మాట్లాడుతూ లైంగిక దాడి, అసభ్య పదజాలం వాడటం, అనుసరించటం లాంటివి జరిగినప్పుడు పోక్సో చట్టం ద్వారా ఎదుర్కొవాలని వివరించారు. అలాగే బాల్య వివాహాల నివారణ చట్టం గురించి కూడా అవగాహన కల్పించారు. పారా లీగల్ వాలెంటీర్స్ శేఖర్, జితేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ దూపం రాణి, ఉపాధ్యాయినులు కొట్టె శ్రీలత, జి.స్వప్న, జి.సుచిత, కె. భాగ్యలక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, రజిని, ఎం.శ్రీలత, టీచర్లు, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులు పాల్గొన్నారు.



## ఎంపీడిఓను కలిసిన బీజేపీ నాయకులు

**చేర్యాల, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఎంపీడీవోగా నూతనంగా బదిలీపై వచ్చిన మండల అభివృద్ధి అధికారి చిలుముల శ్రీనివాస్‌ను శనివారం రోజున బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర మహేందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాల నరసయ్య, సీనియర్ నాయకులు ముచ్చంతల సిద్ధారెడ్డి, వడ్లకొండ వెంకటేశం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక మెప్మా సీవోపై సస్పెన్షన్

**గజ్వేల్, మన చౌరాస్తా :** గజ్వేల్ మహిళా సంఘాల రుణాల మంజూరిలో వారి నుంచి డబ్బులు వసూలు చేసుకుని సొంత అవసరాలకు వినియోగించుకున్న సరస్వతి సమాఖ్య అధ్యక్షురాలు మంజులను సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. అలాగే ఈ అక్రమణలో భాగస్వాములైనటువంటి దుబ్బాక సీవో సరితపై కూడా సస్పెన్షన్ వేటు వేశారు. దీనితో సంబంధం కలిగిన ఆర్. పి కృష్ణ లీలను కూడా తొలగిస్తున్నట్లు గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

## పోక్సో చట్టంలోని ముఖ్య మైన సెక్షన్స్

- సెక్షన్ 3 (Penetrative Sexual Assault) : 18 సంవత్సరాల లోపు ఉన్న బాలుడు/బాలికపై లైంగిక దాడి, శరీరంలోని ఏ ఇతర భాగం లేదా వస్తువు, జననేంద్రియాలు, నోటిలోకి చొప్పించడం లాంటివి చేస్తే Penetrative Sexual Assault గా పరిగణిస్తారు. ఇటువంటి నేరాలకు కనీసం 10 సంవత్సరాల జైలుశిక్ష, గరిష్టంగా జీవిత ఖైదు మరియు జరిమానా పడే అవకాశం.
- సెక్షన్ 5 & 6 (Aggravated Penetrative Sexual Assault) : నిందితుడు బాధితుడి/బాధితురాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీస్, ప్రభుత్వ ఉద్యోగి లాంటి బాధ్యత స్థానంలో ఉంటే, లేదా బాధితుడికి తీవ్రమైన గాయాలు, బాధితురాలు గర్భముదాలిస్తే, గ్యాంగ్ రేప్ జరిగితే, ఇటువంటి నేరాలను Aggravated గా పరిగణిస్తారు. ఇటువంటి నేరాలకు కనీసం 20 సంవత్సరాలు గరిష్టంగా జీవిత ఖైదు / మరణదండన (2019 సవరణ చట్టం ప్రకారం) పడే అవకాశం ఉంది.
- సెక్షన్ 7 (Sexual Assault) : బాలుడి/బాలిక శరీరాన్ని లైంగిక ఉద్దేశంతో తాకడం, దుస్తులపై గానీ, లోపల గానీ అసభ్యంగా తాకడం ఇటువంటి నేరాలకుగాను కనీసం 3 సంవత్సరాల నుంచి గరిష్టంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా పడే అవకాశం ఉంది.
- సెక్షన్ 9 & 10 (Aggravated Sexual Assault) : ఉపాధ్యాయులు, పోలీసు, వైద్యులు లాంటి అధికారి స్థానంలో ఉన్నవారు లేదా బాలుడు/బాలిక ప్రత్యేక సంరక్షణలో ఉండగా వారి పట్ల అసభ్యంగా వ్యవహరిస్తే ఇటువంటి నేరాలకుగాను కనీసం 5 సంవత్సరాల నుండి గరిష్టంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా.
- సెక్షన్ 11 & 12 (Sexual Harassment) : బాలుడి/బాలికను లైంగిక ఉద్దేశంతో అసభ్యంగా మాట్లాడటం, సైగలు చేయడం, అసభ్య చిత్రాలుచూపడం, అశ్లీల సూచనలు చేయడం, అశ్లీల సందేశాలు/ఫోటోలు పంపించడం. ఇటువంటి నేరాలకుగాను గరిష్టంగా 3 సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా.
- సెక్షన్ 13 నుంచి 15 (Pornographic Material): బాలల/బాలికల అశ్లీల ఫోటోలు/వీడియోలు తీయడం, చూడటం, ప్రచారం చేయడం నేరం. ఈ నేరాలకుగాను 5 నుండి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా.
- సెక్షన్ 16 నుంచి 18 (Attempt & Abetment) : నేరానికి ప్రయత్నించడం, ప్రేరేపించడం లేదా సహకరించడం కూడా నేరమే. ఇటువంటి నేరాలకుగాను ఆయా నేరానికి ఉన్న శిక్షలో సగం వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది.
- సెక్షన్ 19 నుంచి 21 (Reporting Obligation) : బాల, బాలికల పై లైంగిక నేరం జరిగినప్పుడు విషయం తెలిసినవారు, చూసినవారు పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. ఇవ్వకపోతే కూడా శిక్షార్హం.
- సెక్షన్ 27 నుంచి 33 (Child Friendly Procedures) : బాధిత పిల్లల గోప్యత కాపాడడం.విచారణలు స్నేహపూర్వకంగా చేయడం. బాధితుని/బాధితురాలు పేరు/ఫోటో బయటపెట్టకూడదు.
- సెక్షన్ 29 (Presumption of Guilt) : న్యాయవ్యవస్థలో ఒక ముఖ్యమైన సూత్రం ఉంది 'కోర్టులో నేరం రుజువు అయ్యే వరకు నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తి నిర్దోషి అని భావిస్తారు. అంటే సాక్ష్యాలు లేకుండా ఎవరికీ శిక్ష వేయద్దు. కానీ పోక్స్‌లోని ఈ సెక్షన్ లో ప్రత్యేక నిబంధన ఉంది. ఒకసారి కోర్టు ముందు కేసు విచారణకు వచ్చి, ప్రాథమిక దశలో నిందితుడిపై సరిపడిన ప్రాథమిక సాక్ష్యాలు (prima facie evidence) ఉంటే, కోర్టు నిందితుడిని దోషిగా పరిగణిస్తుంది . ఈ సందర్భంలో నిందితుడు తన నిర్దోషిత్వాన్ని తానే నిరూపించుకోవాలి.
- సెక్షన్ 30 (Presumption of Culpable Mental State) : నిందితుడు/నిందితురాలు లైంగిక ఉద్దేశ్యంతో చేశాడని కోర్టు భావిస్తే అలా ఆ ఉద్దేశంతో చేయలేదు అని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడే/నిందితురాలు పైన మాత్రమే ఉంటుంది.
- సెక్షన్ 33(8) (Compensation) : ఈ సెక్షన్ ప్రకారం బాధితులకు వైద్య చికిత్స, పునరావాసం కోసం న్యాయస్థానం పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరవచ్చు.



వ్యాస కర్త :
జుట్టు చంద్రశేఖర్
M.SC, LLB,M.A, M.Ed, SET
సెల్ :9059505969

# మన పిల్లల రక్షణ చేతుల్లోనే..

## పోక్సో చట్టంపై అవగాహన అవసరం

***చిన్నారులను చిదిమేసే నీచులు ఎక్కడో ఉండరు. వారు మన చుట్టూ మనతో మంచిగా నటిస్తూ మన శ్రేయోభిలాషులు, బంధువులు, ఇరుగు పొరుగు వారు, అపరిచిత వ్యక్తులు, సన్నిహితులే కావచ్చు . తల్లిదండ్రులు పని కోసం బయటకు వెళ్లినప్పుడు ఇంటి పక్కన ఉన్న పెద్దాయన వారి పాపపై కన్నేశాడు. చాక్లెట్ ఆశచూపి చిన్నారిపై పక్కింటి అబ్బాయి అత్యాచారం చేశాడు. అడుకొంటున్న పాపపై ఒక అపరిచిత వ్యక్తి అత్యాచారం చేశాడు. బడిలో చదువుతున్న పాపపై ఉపాధ్యాయుడి కన్ను, పక్కింట్లో టీవీ చూడడానికి వెళ్తున్న చిన్నారిపై ఓ కుర్రాడు అకృత్యం.. ఇలాంటి అకృత్యాలను అడ్డుకోవడం కోసం ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకొచ్చింది.***

పోక్సో (**POCSO- Protection of Children from Sexual Offenses**) చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం. 2012 మే 22 న భారత పార్లమెంటు చేత ఆమోదం పొంది. 2012 నవంబర్ 14 నుంచి అమలులోకి వచ్చింది. ప్రపంచంలో నే అత్యధిక సంఖ్యలో పిల్లల జనాభా ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల సంఖ్య 472 మిలియన్లు కాగా ఇందులో 225 మిలియన్ల మంది బాలికలు ఉన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 దేశంలోని భారతీయ పౌరులు మరియు బాలల రక్షణకు హామీ ఇవ్వబడింది. పోక్సోచట్టం రాకముందు భారత దేశంలో మహిళలు, పిల్లల కొరకు అమలులో ఉన్న చట్టాలు.

- గోవా చిల్డ్రన్ యాక్ట్ 2003 అనేది పిల్లల లైంగిక వేధింపుల కు సంబంధించిన ఏకైక చట్టం.
- భారతీయ శిక్షాస్మృతి (IPC)లోని సెక్షన్ 375 ప్రకారం స్త్రీ యొక్క సమ్మతి లేకుండా లైంగిక చర్యకు పాల్పడడం అత్యాచారంగా పేర్కొంటుంది. 18 ఏళ్లలోపు వయస్సులో ఉన్నప్పుడు జరిగే లైంగిక సంబంధాన్ని అత్యాచారంగా పరిగణిస్తారు.
- భారతీయ శిక్షాస్మృతి (IPC) లోని సెక్షన్ 354D 'వెంబడించడం' (stalking) అనే నేరానికి సంబంధించినది. మహిళకు ఇష్టం లేకపోయినా, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ ద్వారా పదేపదే వేధించడం, పర్యవేక్షించడం లేదా అనుసరించడం నేరం అవుతుంది. అయితే ఈ చట్టాలు పిల్లలను సమర్థవంతంగా రక్షించలేకపోయినవి అందుకని ప్రభుత్వం సమగ్రమైన చట్టాన్ని రూపొందించింది.

### పోక్సో చట్టం రావడానికి కారణాలు

పిల్లలపై లైంగిక దాడులు, వేధింపులు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. పాత చట్టాలు చిన్నారులను కాపాడలేకపోతున్నాయి. చిన్నారులపై నేరాన్ని నివేదించడం, కోర్టులో సాక్ష్యమివ్వడం కష్టంగా ఉంటుంది. ప్రత్యేకంగా వారి వయసుకు తగ్గ విచారణ, సాక్ష్యం రహస్యంగా ఉండే విధంగా చట్టం అవసరమైంది.

### శిక్షణ తరగతులు, కార్యక్రమాలు..

- SCERT,Delhi (SCERT) ప్రత్యేకంగా 'దీక్ష' అనే ప్రోగ్రామ్ మీద 2025లో ఆన్‌లైన్ ద్వారా పోక్సో ట్రైనింగ్ కోర్స్‌నిర్వహించింది. ఇది ఉపాధ్యాయులకు అందుబాటులోకి తేవాలి. దీనిలో క్రీయేటింగ్ సేఫ్ స్పెసెస్ ద్వారా దాదాపు 8 గంటల లైవ్ విశ్లేషణ, ఎక్స్ పార్ట్ ట్రైనర్స్, చట్టం పై అవగాహన, రిపోర్టింగ్,మానసిక సమతుల్యత, డాక్యుమెంట్, పాఠశాల విద్య కమిటీ ఏర్పాటు, స్టేక్ హోల్డర్‌తో ముఖాముఖి వంటి ప్రాక్టికల్ అంశాలు నేర్పబడుతాయి.
- పాఠశాల ఉపాధ్యాయులు బాధ్యతలను అర్థం చేసుకోవడానికి రెగ్యులర్ ఇన్‌డెక్షన్/ అవగాహన సదస్సులు నిర్వహించాలి.

### పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత..

చట్టం కఠినమైనదే, కానీ దీని ఉద్దేశం పిల్లలను రక్షించడం మాత్రమే. సమాజం,ఉపాధ్యాయులు, అందరూ కలిసి ఈ చట్టం ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి. పిల్లల భద్రతలో నిర్లక్ష్యం ఉంటే, సమాజం నష్టపోతుంది. ఈ చట్టాలు మన పిల్లల భద్రతను సులభతరం చేస్తాయి.

## పోక్సోలో ఉపాధ్యాయులకు ఇబ్బంది..

- **పిల్లలతో నేరుగా, ఎక్కువ సమయంగడపడం :** పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు ఎక్కువ సమయం గడపాల్సిన అవసరం ఉంటది. చిన్న పొరపాటు లేదా అపార్థం కూడా పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. పోక్సో చట్టం ప్రకారం ఆరోపణ వచ్చిన వెంటనే నిందితుడు నిర్దోషి అని కాకుండా దోషి అని ఊహిస్తారు. దీని వల్ల ఎవరైనా విద్యార్థి లేదా తల్లిదండ్రులు ఆరోపణలు చేసినా, ఉపాధ్యాయుడు ముందుగా తాను నిర్దోషి అని రుజువు చేయాల్సి ఉంటుంది. ఇది నిర్దోషి ఉపాధ్యాయుడికి కూడా మానసిక, సామాజిక ఒత్తిడి తెస్తుంది.
- **పిల్లలపై క్రమశిక్షణ చర్యల వల్ల అపార్థం :** ఉపాధ్యాయులు కొన్నిసార్లు పిల్లలను ప్రేమగా తిట్టడం, శిక్షించడం లేదా శారీరక దండనను లైంగిక వేధింపుగా అపార్థం చేసుకోవడం. పాఠశాలలో జరిగే చిన్నచిన్న ఘటనలు కూడా కేసులుగా మారే అవకాశం. దేహంపై తాకడం, కాసేపు ఒంటరిగా మాట్లాడటం వంటి విషయాలను తప్పుగా అర్థం చేసుకోవడం జరుగుతుంది.
- **చట్టం కఠినత్వం :** పోక్సో చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ ఇచ్చిన వెంటనే అరెస్టు జరుగుతుంది. విచారణకు ముందు ఉపాధ్యాయుడు/ ఉపాధ్యాయురాలు తప్పుచేయకున్న దోషి అని భావించే అవకాశం ఉంది.

4. **తప్పుడు ఆరోపణలు :** ఉపాధ్యాయులు మార్కులు తక్కువ వేసిన, కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లేదా సహచరులు తప్పుడు ఆరోపణలు చేయడం జరుగుతుంది. వ్యక్తిగత కక్షలు, ప్రతీకారం, అసంతృప్తి కారణంగా కొన్నిసార్లు తప్పుడు కేసులు వేయబడుతున్నాయి. పాఠశాలలలో
యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల మధ్య కలహాలు కూడా దీనికి ప్రధాన కారణం అవుతున్నాయి.

- **చట్టంపై అవగాహన లోపం :** ఉపాధ్యాయులకు పోక్సో చట్టం గురించి, పిల్లలతో వ్యవహరించే విధానం గురించి సరైన శిక్షణ లేకపోవడం.ఏది లైంగిక వేధింపు, ఏది ప్రేమపూర్వక వాక్యం, ఏది సాన్నిహిత్యం పరిధిలోకి వస్తుందో తెలియక, తెలియక చేసే చర్యల వల్ల అనేక సమస్యలకు దారి తీస్తున్నాయి.

ఉదా: తరగతి గదిలో ఒంటరిగా కూర్చోపెట్టి మందలించడం, ఫోన్‌లో చాటింగ్ వంటి వాటికి కూడా తప్పుగా అర్థం వచ్చే అవకాశం ఉంటుంది.

- పోలీసు విచారణ, కోర్టు హాజరు, విచారణ సమయంలో అవమానం, మానసిక ఒత్తిడి కేసు నమోదు అయితే మీడియా రిపోర్ట్స్ వల్ల మానసిక, సామాజిక ఒత్తిడి పెరుగుతుంది. నిజం బయటపడ్డాకా కూడా ప్రతిష్ట తిరిగి తెచ్చుకోవడం కష్టం.

### విపత్కర పరిస్థితులను తగ్గించటానికి సూచనలు..

- ఉపాధ్యాయులకు చట్టంపై అవగాహన కల్పించాలి. పోక్సో చట్టం సెక్షన్లు, వాటి ప్రభావం, జాగ్రత్తలు గురించి శిక్షణ ఇవ్వాలి.
- **స్పష్టమైన విధానాలు :** విద్యాసంస్థల్లో విద్యార్థులతో ఎలా ఉండాలి. ఎలా మసలుకోవాలి అనే వ్యవహారం పట్ల ఉపాధ్యాయుల కోసం స్పష్టమైన నియమాలు ఉండాలి.
- **పారదర్శక వాతావరణం :** తరగతి గదిలో సీసీ కెమెరాలు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల పట్ల విశ్వాసం కలిగించే చర్యలు ఉండాలి.
- **తప్పుడు ఆరోపణలకు రక్షణ చర్యలు :** చట్టాన్ని దుర్వినియోగం చేసినప్పుడు కఠిన చర్యలు తీసుకునే విధానాలు ఉండాలి.
- **సామాజిక అవగాహన :** పిల్లలు, తల్లిదండ్రులు కూడా చట్టాన్ని సరైన సందర్భంలో మాత్రమే ఉపయోగించాలి. తప్పుడు ఆరోపణలు చేయరాదనే అవగాహన ఉండాలి.
- బాలలపై వేధింపులు ఉపాధ్యాయులకు తెలిసినప్పుడు ఎలా రిపోర్ట్ చేయాలి. అధికారులకు ఎలా తెలియజేయాలి. అనే విషయాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే విధంగా ట్రైనింగ్ ఇవ్వాలి. కౌన్సెలింగ్ బూత్, కంప్లైట్ బాక్స్ వంటివి వాటిని ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులలో 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, బౌండరీస్ వంటి ప్రాముఖ్యత అంశాలు అవగాహన పరచాలి.
- ఉపాధ్యాయులు, సమాజం ఈ చట్టాన్ని తప్పుగా అర్థం చేసుకోవద్దు, చట్టం పిల్లల రక్షణకే ఉంది.

# యూరియా ఇబ్బందులు రావొద్దు : పొన్నం



**భీమదేవరపల్లి, మన చౌరా స్తా :** సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ శనివారం ఉదయం ఫోన్‌లో మాట్లాడారు. యూరియా నిలువలు, సరఫరాల విషయంలో మరింత పర్యవేక్షణ ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో సరిపడా యూరియా అందేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. మండలాల వారీగా ప్రతిరోజూ యూరియా పంపిణీపై రిపోర్ట్ అందజేయాలని, ఎరువుల పంపిణీలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా విజిలెన్స్ మానిటరింగ్ కఠినంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. యూరియా కొరత రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని సూచించారు.

# నక్షత్ర దీక్ష పరుల మాలవిరమణ




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేరుపల్లి మండలం కొత్తకొండలో కొలువైన భద్రకాళి సమేత వీరభద్రుని సన్నిధిలో ప్రతి శ్రావణ మాసంలో నక్షత్ర దీక్షలు తీసుకుంటారు. నక్షత్ర సంఖ్యను బట్టి ఈ ఏడు 27 రోజుల పాటు 100 మందికి పైన భక్తులు నక్షత్ర దీక్షను తీసుకున్నారు. శనివారం దీక్ష చివరి రోజు కావడంతో గురుస్వామి అర్చకులు రాంబాబు నేతృత్వంలో ఇరుముడి ధరించిన భక్తులు కొండపైనున్న దేవాలయాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్ రావు అర్చకులు వినయ్, తాటికొండ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడల్లో భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**జనగామ, మన చౌరాస్తా :** గ్రామీణా ప్రాంతాల యువతకు, మహిళలకు క్రీడలో ఆసక్తిని పెంచే లక్ష్యంగా ఈషా ఫౌండేషన్ గ్రామోత్సవ వేడుకలని నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో శనివారం ఈషా ఫౌండేషన్ నిర్వహించిన 17వ గ్రామోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామోత్సవం కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలలో క్రీడా స్ఫూర్తి ని నింపేందుకు అలాగే యువత, మహిళల సమగ్ర ఆరోగ్యాభివృద్ధికి, వారి జీవన విధానంలో మార్పు తీసుకురావడానికి మంచి ప్రయత్నమన్నారు ఈషా ఫౌండేషన్ నిర్వహిస్తున్న వాలీబాల్, త్రో బాల్ క్రీడా పోటీల్లో గ్రామీణ ప్రాంతాలోని మహిళలు, యువత ఈ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో గెలిచి ఆ తర్వాత జాతీయ స్థాయిలో కూడా గెలిచి మన జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. ఈ పోటీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి 41 వాలీబాల్ జట్లు,20 త్రో బాల్ జట్లు, సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి బి.వెంకటరెడ్డి, ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ ప్లేయర్ కృష్ణవేణి, ఈషా ఫౌండేషన్ నుంచి స్వామి పులక, వ్యాయామ ఉపాధ్యాయులు, ఈశా ఫౌండేషన్ నుంచి వలంటీర్లు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజించండి

ఈనెల 27న నిర్వహించే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా కోరారు. మట్టి గణపతులను ప్రతిష్టించడం వలన పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని, మట్టి గణపతుల నిమజ్జనం వలన నీటి కాలుష్యాన్ని కూడా అరికట్ట వచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు మట్టి గణపతులను తయారుచేసే కుమ్మరి, శాలివాహన కులముల వారికి తగిన ప్రోత్సాహం ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు కుమ్మరి, శాలివాహనులచే తయారు చేయబడిన మట్టి గణపతి విగ్రహాలను ప్రజలు ఎక్కువ సంఖ్యలో ప్రతిష్టించే విధంగా ప్రోత్సహించాలని ఆదేశించారు.

# శాంతిభద్రతలతో నవరాత్రులు నిర్వహిద్దాం..



**జనగామ, మన చౌరాస్తా :** వినాయక నవరాత్రులను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతల నడుమ ఉత్సవాలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా నిర్వాహకులు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ అన్నారు. ఈ నెల 27న వినాయక చవితి వస్తుందని ఉదయం 6.00 నంచి 11.35 వరకు, మ. 12.30 నుంచి 2.25, సా. 4 నుంచి రా8.30 గంటల వరకు శుభ సమయాలు ఉన్నాయని తెలిపారు. వినాయకుడికి ప్రీతికరమైన బుధవారం వినాయక చవితి రావడం విశేషమని, తొమ్మిది రోజులకు మించి నిమజ్జనం ఆలస్యం చేయకూడదని, సెప్టెంబర్ 7న సంపూర్ణ చంద్రగ్రహణం వస్తున్నందున, గ్రహణం రోజు నిమజ్జనం చేయకూడదని అన్నారు. 8న నుంచి పితృపక్షాలు ప్రారంభమవుతాయి కనుక పౌర్ణమి లోపుగా నిమజ్జనాలు పూర్తి చేయాలని ఉత్సవాల నిర్వాహకులను కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ సమాజ భద్రత కోరుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వివాదాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలని, సమన్వయం పాటించాలని కోరారు. ప్రతీమండపం వద్ద భద్రత ఏర్పాట్లు చేయాలని, నిర్వాహకులే సంరక్షణగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధర్మ ప్రచారానికి వినాయక నవరాత్రులను వేదికగా నిలపాలని, హిందూ జాతి ఐఖ్యతను చాటి చెప్పి, జనగామ జిల్లాని ఆదర్శవంతమైన హిందూ సమాజంగా నిలుపుదామని పిలుపునిచ్చారు..

# నానో ఎరువులతో లాభాలు

**చేర్యాల, మన చౌరాస్తా :** రైతులు నానో ఎరువులు వాడ టం వలన అధిక లాభాలు ఉ న్నాయని చేర్యాల ఏడీఏ రాధిక అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐఎఫ్ఎఫ్సిఓ సంస్థ ప్రతినిధులు, వ్యవసాయ అధికారి బోగేశ్వర్ నానో యూరియా, నానో డీఏపీ పంటలపై పిచికారి చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ పంటలకు వాడుకోవడం వలన రైతులకు ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి కూడా పెరుగుతుందని సూచించారు. అనంతరం ఇఫ్కోమేనేజర్ మాట్లాడుతూ ఒక బస్తా యూరియా 45 కేజీ, ఒక నానో యూరియా 500 ఎంఎల్‌తో సమానమని, యూరియా బస్తా కోసం బారులు తీరి సమయం వృథా చేసుకోవడం కంటే ఒక్క 500 ఎంఎల్ నానో యూరియా వాడాలని, దీనిలో నైట్రోజన్ వృథా కాదని లాభాల విష యంలో చూస్తే బస్తా కంటే బాటిల్ వల్ల కలిగే ప్రయోజనాలు ఎక్కువ అని అన్నారు. కార్య క్రమంలో ఇఫ్కో మేనేజర్ చంద్రబాబునాయుడు, ఏవో భోగేశ్వర్, ఏఈవోలు ప్రవీణ్ కుమార్, రవళి, అఖిల, పూజ, శ్రావ్య, రజిత, మౌనిక, చేర్యాల మండల రైతులు పాల్గొన్నారు.






# యూరియా కోసం రైతుల అవస్థలు

**గజ్వేల్, మన చౌరాస్తా :** రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో యూరియా కోసం రైతులు చెప్పులు, కర్రలతో క్యూలైన్లు ఏర్పరచుకొని పడిగాపులు కాస్తూ ప్రభుత్వంపై నిరసన తెలుపుతూ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని యూరియా కొరతను తీర్చాలని రైతులు కోరారు.

# కుదిరితే ఇసుక.. లేదంటే మట్టి..

- ఇదీ అక్రమార్కుల పనితనం
- పట్టించుకోని అధికారులు





**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండల పరిధిలో అక్రమ మట్టి ఇసుక, తరలింపు జరిగిన పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జనగామ మండలంలోని మరిగడి కోటగుట్ట పరిసర ప్రాంతాల్లో జేసీబీలలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టి, ఇసుకను తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి అక్రమంగా తరలించిన మామూళ్ల మత్తులో అధికారులు మునిగిపోయారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి తరలించి వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కిన సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు నిమ్మకు నేరెత్తినట్టు ఉండడం పలు సందేహాలకు తావిస్తోంది. వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు మట్టి మాఫియాకు కొమ్ముకాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

# బీజేపీపై విష ప్రచారం మానుకోవాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** బీజేపీపై కాంగ్రెస్ పార్టీ విష ప్రచారం మానుకోవాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి పృధ్వీరాజ్ అన్నారు. శనివారం ములకనూరులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని వీర్లగడ్డ తండాలో గ్రామపంచాయతీ నిర్మాణానికి నిధులు కేటాయించిన విషయం మర్చిపోవద్దన్నారు. కొత్తకొండ నుంచి అక్కన్నపేట వరకు జరుగుతున్న డబ్బులు రోడ్డు పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతోనే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు కట్టిస్తుంటే ఇందిరమ్మ కమిటీలను ముందు పెట్టి నిరుపేదల ప్రజలకు ఇల్లు రాకుండా చేస్తున్నారని ఆయన విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడం చేత గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, 25 గ్రామాల సమస్యలు రెండు రోజుల పర్యటనలో ఏమి తెలుస్తాదని ఆయన విమర్శించారు.



# జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బచ్చన్నపేట మండల కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక ఉన్నత చదువుల కోసం విద్యార్థులు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అరవింద్, అఖిల్, శ్రీధర్, కమల్, రాకేష్, అరవింద్, సతీష్, ఆనంద్ పాల్గొన్నారు










# కామ్రేడ్ సురవరం మృతి సీపీఐకి తీరనిలోటు

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్**

**చేర్యాల, మన చౌరాస్తా:** సీపీఐ అగ్ర నాయకులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి తెలంగాణ రాష్ట్రానికి, పార్టీకి తీరని లోటని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్ అన్నారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల పట్టణంలోని అంగడి బజారులో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ లో చేరి విద్యారంగా సమస్యలపై అలుపెరగని పోరాటం కొనసాగించిన సురవరం సుధాకర్ రెడ్డి అంచెలంచెలుగా ఎదుగుతూ ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా విద్యా వైద్య ఉపాధి హక్కులకై ఉద్యమించి భారత విద్యార్థి యువతను ఏకం చేశాడని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిస్టు రథసారథిగా సీపీఐ నిర్మాణాన్ని పటిష్ట పరుస్తూ పాలకుల విధానాలపై సమరశంఖం పూరించాడని అన్నారు. 1971లో జాతీయ సమితి సభ్యులుగా పనిచేశాడని 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాడని అన్నారు. రెండు పర్యాయాలు నల్లగొండ ఎంపీ గా ఎంపీగా గెలుపొందాడని అన్నారు. కార్మిక శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా పని చేయడంతో పాటు అనేక పార్లమెంటరీ కమిటీలకు చైర్మన్ గా పనిచేశారని తెలిపారు. సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ 2012 మార్చి 31న పాట్నాలో జరిగిన మహాసభలలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై మూడు పర్యాయాలుగా 2019 వరకు విశేష సేవలు అందించారని అన్నారు. నీతి నిజాయితీ నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకుడిగా అనేక భూ పోరాటాలు నిర్వహించి పేదలకు ఇంటి స్థలాలు సాధించి పెట్టారని, విద్యార్థి, యువత కార్మిక కర్షక అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి భారతదేశ ప్రజానీకానికి ఎన్నో సేవలు అందించారని, సురవరం సుధాకర్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని చేర్యాల ప్రాంతంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్ రెడ్డి, వలబోజు నరసింహ చారి, పొన్నబోయిన మమత, గుడెపు సుదర్శన్, నిమ్మల పర్శరాములు, నర్సిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్ రెడ్డి సేవలు అజరామరం

**భీమదేవరపల్లి :** కమ్యూనిస్టు పోరాట యోధుడు సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి సేవలు అజరామమైనవని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదరి శ్రీనివాస్ అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సురవరం మృతికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. తన జీవిత కాలం మొత్తం కార్మిక లోకం కోసం త్యాగం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆదరి రమేష్, నాయకులు బాలరాజ్, రావుల తిరుపతి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు




# ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ధర్నా

**జనగామ, మన చౌరాస్తా :** దేశవ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్‌లోని ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు గుట్టంగారి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించాన ఈ ధర్నాకు రెడ్డి జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగ ప్రణీత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఇమ్మడి హరీష్ రెడ్డి, నిమ్మ హరేందర్ రెడ్డి జనగామ నుంచి తరలి వెళ్లారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు గురుకులాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, రామ్ రెడ్డి ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపి పార్లమెంట్ లో ఈ అంశంపై మాట్లాడుతామని హామీ ఇచ్చారు.




# ఉప ఎన్నికలు రావడం ఖాయం

**బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు సందీప్**



**జనగామ, మన చౌరాస్తా :** పార్టీ పిరాయించిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో తప్పకుండా ఉప ఎన్నికలు వస్తాయని, ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని జనగామ బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించిన కోదండరామ్ రెడ్డి, అమీర్ అలీ ఖాన్ పదవులను సుప్రీమ్ కోర్టు రద్దు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. అదే విధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దవడం కూడా ఖాయమని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు విషయంలోనూ, సంక్షేమ పథకాల అమలులోనూ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల ఆదరాభిమానాలు పొందడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వెనుకబడి ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా, నాయకత్వం, అనుభవం కలిగిన నాయకుడు కేసీఆర్ అన్నారు.



# రహదారులకు మరమ్మతులు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ముందు వర్షానికి దారులు కొట్టుకకోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిని గమనించిన పోలీసులు చొరవ తీసుకొని మట్టిపోసి టాక్టర్ల సహాయంతో సమానంగా చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రత్నగిరి లక్ష్మీనరసింహస్వామి జాతర

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరిలో కొండపైన కొలువైన లక్ష్మీనరసింహస్వామి జాతర శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి శ్రావణ మాసంలో చివరి రోజు జరిగే ఒక్కరోజు జాతరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 40 వేలకు మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు కొండపైకి ఎక్కేందుకు పోటీపడ్డారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ వెంకట్ నారాయణ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముల్కనూర్ టౌన్ మార్టు ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అవాంఛనీయ సంఘటన జరగకుండా సీఐ రమేష్ ,ఎస్సై దివ్య నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పది మందికి పైన సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి లోని సెయింట్ థామస్ పాఠశాల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.



